


నేడే ఇంటర్ ఫలితాలు

శ్రీకాకుళం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు శుక్రవారం ఉదయం 11 గంటలకు వెలువడనున్నాయి. ఈసారి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఒకేసారి విడుదల చేస్తున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 19,937మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 25,765 మంది హాజరయ్యారు. ఇందులో ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులు 2,631మంది పరీక్షలు రాశారు. వీళ్లందరూ పరీక్షా ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు.

దువ్వాడకు ఎదురుగాలి!



దువ్వాడ శ్రీనివాస్



కిల్లి కృపారాణి

- టెక్కలి నియోజకవర్గమంతా ఇంతే..
- టీడీపీలోకి భారీగా చేరికలు
- అటు కాంగ్రెస్ నుంచి కృపారాణి పోటీ
- వైసీపీకి కలిసిరాని కేడర్

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

జిల్లాలో ఎన్నికల వేడి పెరుగుతోంది. విజయమే లక్ష్యంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. వైసీపీలో వర్గవిభేదాలు, కేడర్ అంటీఅంటనట్టు ఉండడం, కొంతమంది ప్రచారానికి దూరం కావడంతో ఆ పార్టీ అభ్యర్థులకు ఉక్కపోత ఆరంభమైంది. ప్రధానంగా టెక్కలి నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు నియోజకవర్గమంతా ఎదురుగాలి వీస్తోంది. రాష్ట్రంలోని కుప్పం, పిఠాపురం నియోజకవర్గాల మాదిరిగానే టెక్కలి నియోజకవర్గాన్ని వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడును ఎలాగైనా ఈ సారి ఓడించాలని విశ్వప్రయత్నాలు చేస్తోంది. కాగా.. దివంగత నేత ఎర్రన్నాయుడు హయాం నుంచీ కింజరాపు కుటుంబం ప్రజల మన్ననలు పొందుతోంది. అదే సమయంలో వైసీపీ అభ్యర్థికి సొంతపార్టీ నుంచే అసమ్మతి సెగ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈసారి కూడా అచ్చెన్నను ఓడించడం వైసీపీకి కత్తిమీద సామేనన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ప్రజాదరణ కరువు

గతేడాది మూలపేట పోర్టు శంకుస్థాపన సమయంలో.. టెక్కలి వైసీపీ అభ్యర్థిగా దువ్వాడ శ్రీను పేరును సీఎం జగన్ ప్రకటించారు. ఆ కొద్దిరోజుల్లోనే దువ్వాడకు ఇంట్లోనే ముసలం బయటపడింది. కొన్ని కీలక విషయాలను సీఎం దృష్టికి శ్రీను సతీమణి వాణి తీసుకెళ్లి.. తనకే టికెట్ కేటాయించాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో ఆమెను టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా జగన్ ప్రకటించారు. ఇటీవల వాణిని కాదంటూ మళ్లీ దువ్వాడ శ్రీనుని వైసీపీ అభ్యర్థిగా ఖరారు చేశారు. కాగా.. దువ్వాడ ఎన్ని పార్టీలు మారినా.. ఏ ఎన్నికల్లోనూ గెలుపొందిన దాఖలాలు లేవు. గత(2019) ఎన్నికల్లో వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి.. ఓటమి పాలయ్యారు. శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. ఐదు చోట్ల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు ఓటమి చెందారు. క్రాస్ ఓటింగ్ ద్వారా ఎంపీగా రామ్మోహన్‌నాయుడును ప్రజలు గెలిపించారు. టీడీపీ ఓటమి చెందిన ఆ ఐదు నియోజకవర్గాల్లోనూ ప్రజలు దువ్వాడకు ఆశించినస్థాయిలో మద్దతు తెలపకపోవడం గమనార్హం. గత ఎన్నికల్లో దువ్వాడ ఓడినా.. దుందుడుకు స్వభావంతో సీఎం జగన్ దృష్టిలో పడి ఎమ్మెల్సీ పదవిని దక్కించుకున్నారు. ఈ క్రమంలో అచ్చెన్నాయుడుపై, టీడీపీ నేతలపై కేసులు పెట్టించి.. దువ్వాడ సంబరపడ్డారు. ఈసారి ఎన్నికల్లో అచ్చెన్నను ఓడిస్తే జగన్ వద్ద మరింత గుర్తింపు లభిస్తుందని ఆరాటపడుతున్నారు. కానీ పరిస్థితి మరోలా ఉంది. టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల్లో రోజూ వందలాది మంది వైసీపీని వీడి అచ్చెన్న సమక్షంలో టీడీపీలో చేరుతున్నారు. తాజాగా గురువారం కూడా టెక్కలి పంచాయతీలోని వెంకటేశ్వరకాలనీ, కంద్రవీధితోపాటు పెద్దసాన పంచాయతీ పరశురాంపురానికి చెందిన వందలాది మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. దీంతో వైసీపీ నేతలు కలవరపడుతున్నారు.

కృపారాణి పోటీతో మరింత ఇబ్బందికరమే

వైసీపీలో నిరాదరణకు గురైన కేంద్రమాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి.. ఇటీవల ఆపార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరారు. టెక్కలి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగారు. కళింగ సామాజిక వర్గానికి చెందిన ఆమె ఎన్నికల బరిలో దిగడంతో ఆ వర్గంలో కచ్చితంగా ఓట్ల చీలిక తప్పదు. పైగా కృపారాణి వర్గం కూడా వైసీపీలో అంతర్గతంగా ఉంది. దీంతో వైసీపీకి ఎన్నికల్లో తీవ్ర నష్టం తప్పదు. ఇక వైసీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌తో కొన్ని నెలలు వరకు దువ్వాడకు సఖ్యత లేదు. సీఎం జగన్ కలుగుజేసుకుని.. ఇరువురూ సమష్టిగా పనిచేయాలని ఆదేశిస్తేనే.. ఈమధ్య కలిసి ప్రచారం చేస్తున్నారు. తిలక్ గత ఎన్నికల్లో టెక్కలిలో అచ్చెన్నపై వైసీపీ తరపున పోటీ చేసి ఓటమి చెందారు. ఈసారి అచ్చెన్నపై దువ్వాడ పోటీ చేయగా.. మరోవైపు కృపారాణి కూడా కాంగ్రెస్ తరపున బరిలో దిగుతుండడంతో వైసీపీకి గెలుపు కష్టమేనన్న ప్రచారం సాగుతోంది.



అచ్చెన్న సమక్షంలో టీడీపీలో చేరిన వెంకటేశ్వర కాలనీ, కంద్రవీధి ప్రాంత వాసులు

టెక్కలిలో వైసీపీకి భారీ షాక్

- 300 కుటుంబాలు టీడీపీలో చేరిక

టెక్కలి, ఏప్రిల్ 11: టెక్కలి మేజర్‌పంచాయతీలోని వెంకటేశ్వర కాలనీ, కంద్రవీధి ప్రాంతాల నుంచి సుమారు 300 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. గురువారం కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. టెక్కలి పంచాయతీ ఒకటవ వార్డు సభ్యుడు సువ్వారి రాజేశ్వరరావు, కంద్ర కుల సంఘ నాయకులు బొన్నాలీ మాలీతో పాటు పలువురు స్వదేశీ మత్స్యకార కుటుంబాలు పార్టీలో చేరడంతో టెక్కలిలో వైసీపీకి భారీషాక్ తగిలింది. అలాగే పెద్దసాన పంచాయతీ పరశురాంపురం నుంచి 25 కుటుంబాలు వైసీపీని వీడి అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలో చేరాయి. కర్రిక అభిషేక్, గువ్వాడ రమేష్, లింగాల భాస్కరరావు, ఉమాపతి, చంద్రరావు, రాజు, నందేసు, బి.రామారావు, జయచంద్ర, హేమారావు తదితరులను టీడీపీలోకి అచ్చెన్న ఆహ్వానించారు. అలాగే విశ్వబ్రాహ్మణుల సంఘం సభ్యులు కూడా అచ్చెన్నను మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు తెలిపారు. ఎన్నికల్లో అచ్చెన్న వెంటే ఉంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. టెక్కలి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు బగాది శేషగిరి, పట్టణశాఖ అధ్యక్షుడు కోళ్ల లవకుమార్ ఉన్నారు.

సేవ్.. పలాస జీడి

- కోళ్ల దాణా ముసుగులో అక్రమ దిగుమతి
- వియాత్నం టు నేపాల్.. టు పలాస మార్కెట్
- ఇద్దరు బ్రోకర్ల భాగస్వామ్యంతో హవా
- నష్టపోతున్న స్థానిక వ్యాపారులు





(పలాస)

పలాస జీడిమార్కెట్‌లో విదేశీ జీడిపప్పు రాజ్యమేలుతోంది. విదేశాల్లో కారుచౌకగా లభించే నాసిరకం జీడిపప్పును కొంతమంది వ్యాపారులు అక్రమంగా దిగుమతి చేసి.. పలాస జీడిగా చెప్పి విక్రయిస్తూ వినియోగదారులను మోసగిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'సేవ్ పలాస' అంటూ జీడిపప్పు మార్కెట్‌ను రక్షించుకోవాలని ఇతర జిల్లాల నుంచి జీడి వ్యాపారులు పలాస వ్యాపారులకు వాట్సాప్, ఫేస్‌బుక్‌లో హెచ్చరికలు పంపుతున్నారు. అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మన దేశానికి పొరుగునే ఉన్న నేపాల్ దేశంతో వ్యాపార సంబంధాలకు ఎటువంటి ఆంక్షలు లేవు. నేరుగా అక్కడ నుంచి సరుకులు తీసుకురావచ్చు. దీన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది బ్రోకర్లు వియాత్నం వంటి దేశంలో లభించే జీడిపప్పును నేరుగా నేపాల్‌కు తరలిస్తున్నారు. అక్కడ నుంచి పలాస జీడి మార్కెట్‌లో ఉన్న ఇద్దరు బ్రోకర్లు ఎవరికీ అనుమానాలు రాకుండా రవాణా చేస్తున్నారు. నాసిరకం జీడిపప్పు పేరుతో ఒకరు, కోళ్ల దాణా పేరుతో మరొకరు దీన్ని తరలిస్తున్నారు. అక్కడ కిలో రూ.300కు కొనుగోలు చేసి రూ.50 అదనంగా వేసుకొని మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. దేశంలో వివిధ రాష్ట్రాలకు ఆ సరకులు పంపిణీ చేసి బ్రోకర్లు సొమ్ము చేసుకుంటున్నారు. రంజాన్ మాసంలో టన్నుల కొద్దీ జీడిపప్పును నేపాల్ నుంచి దిగుమతి చేసి మార్కెట్‌లో విక్రయించారు.

దేశీయ పప్పుపై ప్రభావం..

ప్రస్తుతం పలాస జీడి మార్కెట్‌లో కిలో జీడి పప్పు రూ.700 ఉంది. నేపాల్ నుంచి వస్తున్న జీడిపప్పును రూ.500కే విక్రయిస్తున్నారు. దీంతో ట్రేడర్లు దీన్నే కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నారు. వాస్తవానికి వియాత్నం నుంచి మన దేశానికి నేరుగా జీడిపిక్కలు వస్తాయి. నిబంధన ప్రకారం జీఎస్టీ కట్టుకొని ముడిసరుకు తెచ్చుకొని వ్యాపారం చేసుకుంటున్నారు. దీన్ని పలాస ప్రాంతాల్లో ప్రాసెసింగ్ చేసుకొని తక్కువ లాభాలకు అమ్ముతు ఏటా కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు వ్యాపారులు లాభాలు గడిస్తున్నారు. స్వదేశీ పిక్కలు లభించకపోయినా కొంతవరకూ విదేశీ పిక్కలు ఆదుకుంటున్నాయి. అయితే నేరుగా జీడిపప్పే మార్కెట్‌లోకి రావడంతో మొత్తం పరిశ్రమలు, కార్మికులు, వ్యాపారులపై ఆ భారం పడింది. నేపాల్ మార్కెట్ తట్టుకోలేక కొంతమంది వ్యాపారులు ఇప్పటికే పరిశ్రమలు బంద్ చేసి ఇతరులకు అద్దెకు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. సంప్రదాయ పద్ధతిలో కొద్దిపాటి లాభం వస్తే చాలని మరికొంతమంది వ్యాపారులు ముందుకు వెళ్తున్నారు. కానీ ఇద్దరు బ్రోకర్ల వల్ల మొత్తం పరిశ్రమల మనుగడపైనే ప్రభావం చూపిస్తుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. నెల రోజుల నుంచి 'సేవ్ పలాస' అనే నినాదం వ్యాపారుల్లో చర్చనీయాంశమవుతోంది. నేపాల్ నుంచి వచ్చే జీడిపప్పుపై ఎటువంటి నిఘా లేకపోవడంతో వ్యాపారులకు పంట పండిందనే చెప్పవచ్చు. ప్రస్తుతం ఎన్నికల విధుల్లో అధికారులు నిమగ్నం కావడంతో అక్రమంగా తరలిస్తున్న జీడిపప్పుపై దృష్టి సారించడం లేదు. దీంతో వ్యాపారుల ఆగడాలు సాగుతున్నాయి. మరో ఏడాది పాటు నేపాల్ నుంచి వచ్చే నాశిరకం జీడిపప్పు పలాసలో రాజ్యమేలితే ఇక పలాస బ్రాండ్ పోయి వియాత్నం బ్రాండ్ వచ్చే ప్రమాదం ఉంది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్రంగా విచారించి విదేశీ జీడిపప్పు రవాణాపై దృష్టి సారించాలని స్థానిక వ్యాపారులు కోరుతున్నారు.



జామియామసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు

భక్తి శ్రద్ధలతో రంజాన్



నమాజ్ చేస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 11: జిల్లాలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు చేసుకున్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. శ్రీకాకుళంలోని జామియా మసీదుకు.. జిల్లా నలమూలల నుంచి సుమారు 1,500మందికిపైగా తరలివచ్చారు. ముస్లిం మతపెద్ద ఇమామ్ వహాబ్ ఆధ్వర్యంలో నమాజ్ చేశారు. కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ కూడా రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ తదితరులు పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకాకుళంలోని మీనా మసీదు, పిరుదౌష్, చందక్ తదితర మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు చేశారు.

జనసేన ఉమ్మడి జిల్లా కమిటీ నియామకం

శ్రీకాకుళం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా జనసేన కమిటీ నియామకానికి ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఆమోదం తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా పిసిని చంద్రమోహన్ కొనసాగుతున్నారు. జిల్లా కమిటీలో ముగ్గురు ఉపాధ్యక్షులు, ఆరుగురు ప్రధాన కార్యదర్శులు, 15 మంది చొప్పున కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు నియమిస్తూ పార్టీ అధిష్ఠానం గురువారం ప్రకటన విడుదల చేసింది.

- ఉపాధ్యక్షులుగా.. గర్భాన సత్తిబాబు, పాత్రుని పాపారావు, భూపతి అర్జున్‌కుమార్ నియమితులయ్యారు.
- ప్రధాన కార్యదర్శులుగా.. కూరాకుల యాదవ్, డాక్టర్ దానేటి శ్రీధర్, లోళ్ల రాజేష్, సంతోష్‌కుమార్ పండా, కోళ్ల జయరామ్, యూపీ రాజు వ్యవహరించనున్నారు.
- కార్యదర్శులుగా.. సలాసన షణ్ముఖరావు, బొంతు విజయకృష్ణ, పల్లి కోటేశ్వరరావు, మజ్జి భాస్కరరావు, మెట్టా అవినాష్, బబ్బాది పకీరునాయుడు, కోరుకొండ మల్లేశ్వరరావు, వడ్డాది శ్రీనివాసరావు, కొండా ఉదయ్ శంకర్, దన్నాన ఈశ్వరరావు, బమ్మిడి ఉపేంద్రసాయి సిద్ధు, తాలాబత్తుల పైడిరాజు, కర్రి మన్మథరావు, అంపోలు హరీష్‌కుమార్, శ్రీకాంత్, సవర రామమూర్తిని నియమించారు.
- సంయుక్త కార్యదర్శులుగా... వారాది వరలక్ష్మి, వెలుగొండ గురుప్రసాద్, దాసరి బలరాం, కీర్తి సుశీల, ఇసాయి వెంకటేష్, కొంచాడ చిన్నమనాయుడు, మహ్మద్ రఫీ, దిలీప్ కుమార్ పాణిగ్రహి, చిట్టి భాస్కరరావు, వజ్రగడ రవికుమార్ జానీ, లావేటి సురేష్, అనపాన జనార్దనరెడ్డి, కొంద్ర వరప్రసాద్, గొట్టా హరిప్రసాద్, సైలాడ జగదీశ్వరరావు వ్యవహరించనున్నారు.

విద్యుత్ బిల్లు.. గుబులు


- ఆరు యూనిట్లకు రూ.2,211



కవిటి, ఏప్రిల్ 11: విద్యుత్ బిల్లులు వినియోగదారులు గుబులు పుట్టిస్తున్నాయి. కవిటి మండలం కుసుంపురానికి చెందిన డి.వాసుదేవ్ నెలరోజుల వ్యవధిలో ఆరు యూనిట్ల విద్యుత్ మాత్రమే వినియోగించగా.. రూ.2,211 బిల్లు రావడంతో అవాక్కయ్యాడు. వాసుదేవ్‌కు చెందిన రేకు ఇల్లులో సర్వీసు నెంబర్ 208 మీటరుకు బుధవారం విద్యుత్ రీడింగ్ తీశారు. బిల్లులో చార్జీ రూ.14.26 పైసలుగా చూపారు. తర్వాత ఫిక్స్‌డ్, కస్టమర్ చార్జీ, ఎఫ్‌పీపీసీఏ 2 చార్జీలతో పాటు షార్ట్‌ఫాల్ కింద రూ.2,133 బిల్లు వేశారు. మొత్తం బిల్లు రూ.2,214 కాగా ప్రభుత్వం సబ్సిడీ మూడు రూపాయలు తగ్గించారు. రూ.2,211 చెల్లించాలని బిల్లు ఇచ్చారు. ఆ బిల్లును చూసి వాసుదేవ్ లబోదిబోమంటున్నాడు. విద్యుత్‌శాఖాధికారులను సంప్రదించనున్నాడు.

ప్రోత్సాహమేదీ?

- మామిడి రైతులను పట్టించుకోని ప్రభుత్వం
- అందని రాయితీలు.. తగ్గిన దిగుబడులు



కాయలు రాని మామిడి చెట్లు

- మెళియాపుట్టి మండలం జంతూరు గ్రామానికి చెందిన గేదెల రామన్నకు మూడు ఎకరాల మామిడి తోట ఉంది. ఏటా వాతావరణ పరిస్థితులు అనుకూలించక.. మామిడి కాపు సక్రమంగా లేక నష్టపోతున్నాడు. మామిడి పంట నష్టానికి సంబంధించి ప్రభుత్వం పరిహారం కూడా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.
- మెళియాపుట్టి మండలం బందపల్లికి చెందిన బి.బాబురావుకు ఐదు ఎకరాలు మామిడితోట ఉంది. తోటలో మొక్కలు నాటి 40 ఏళ్లు దాటగా.. ప్రస్తుతం కాపురాని పరిస్థితి కనిపిస్తోంది. గతంలో క్వినాపి మేనేజ్‌మెంటు పథకం కింద రూ.5వేల వరకు రాయితీ ఇచ్చేవారు. ఆ డబ్బులతో మొక్కల కొమ్మలు కత్తిరించగా.. కొత్త జంటలు వచ్చి మళ్లీ కాపు కాసేవి. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎటువంటి నిధులు అందడం లేదని బాబురావు వాపోతున్నాడు.

(మెళియాపుట్టి)

ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు.. మరోవైపు ప్రభుత్వ ప్రోత్సాహం లేక మామిడి రైతులు కుదేలవుతున్నారు. ఏటా మామిడి దిగుబడి తగ్గుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి రాయితీలు కల్పించడం లేదని వాపోతున్నారు. గతంలో ఐదేళ్ల నుంచి పదేళ్లలోపు మామిడి తోటలకు క్వినాపి మేనేజ్‌మెంట్ పథకం కింద కొమ్మల కత్తిరింపు కోసం హెక్టార్‌కు రూ.5వేలు రాయితీ ఇచ్చేవారు. ఎరువులు, మందులపై కూడా రాయితీ కల్పించేవారు. 20 ఏళ్లలోపు తోటలకు పునరుద్ధరణ పథకం కింద హెక్టార్‌కు రూ.20వేల రాయితీతో వివిధ రకాల పరికరాలు ఇచ్చేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన రాయితీల ఊసే లేదని రైతులు నిరాశ చెందుతున్నారు. ఈ క్రమంలో జిల్లాలో మామిడిసాగు విస్తీర్ణం తగ్గుముఖం పడుతోంది. మూడేళ్లుగా కొత్తగా తోటల పెంపకానికి రైతులు ఆసక్తి చూపడం లేదని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని సుమారు 25వేల హెక్టార్లలో మామిడి సాగు అవుతోంది. మెళియాపుట్టి, టెక్కలి, మందస, పాతపట్నం, నందిగాం, కొత్తూరు, కోటబొమ్మాళి, నరసన్నపేట, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల్లో అధికంగా మామిడి సాగు చేస్తున్నారు. కోల్‌కతా, బరంపురం, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా వంటి ప్రదేశాలకు జిల్లా నుంచి మామిడి పంట ఎగుమతి అవుతుంది. ప్రస్తుతం గిట్టుబాటు ధర లేదు. అలాగే కాయలు కోత కోసిన వెంటనే నిల్వ ఉంచేందుకు కోల్డ్‌స్టోరేజ్‌లు కూడా లేదు. మామిడి పంట అంతా ఒకేసారి కోయడం వల్ల మార్కెట్‌లో ధరలు తగ్గుదల కనిపిస్తుంది. దీంతో తాము మరింత నష్టపోతున్నామని రైతులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది కూడా ఆశించిన స్థాయి దిగుబడి వచ్చే సూచనలు కనిపించడం లేదు. పూత ఆలస్యమవడంతోపాటు నల్లితామర, తేనేమంచు, పురుగు తెగుళ్ల వంటి మామిడికి సోకుతున్నాయి. ఎకరాకు ఆరు టన్నుల వరకు దిగుబడి వచ్చేది. ప్రస్తుతం రెండు టన్నుల కన్నా ఎక్కువ దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. ప్రస్తుతం పిందె దశలో ఉండగా.. వర్షాలు కురిసి.. గాలులు వీస్తే ఆ పంట కూడా దక్కే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి రాయితీలు అందజేయాలని, ప్రోత్సాహం కల్పించాలని కోరుతున్నారు.

పథకాలు అందిస్తున్నాం

ఉద్యానవన శాఖ ద్వారా రైతులుకు పథకాలు అందిస్తున్నాం. మామిడి మొక్కల కత్తిరింపునకు దరఖాస్తులు వచ్చాయి. వాటిని జిల్లా అధికారులకు అందజేశాం.

-దుక్క శరత్‌రెడ్డి, ఉప ఉద్యానవనశాఖ అధికారి

జ్యోతిబా పూలే ఆశయ సాధనకు కృషి

●జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన నివాళి

సంఘసంస్కర్త జ్యోతిబాపూలే ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పూలే జయంతి పురస్కరించుకుని చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **కలెక్టరేట్:** జ్యోతిబా పూలే, సావిత్రిబాపూలే దంపతులు బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని డీఆర్వో ఎం.గణపతిరావు కొనియాడారు. శ్రీకాకుళంలోని కలెక్టరేట్ సమావేశమందిరంలో మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి ఇ.అనురాధ, డీపీఆర్వో కె.బాలమాన్‌సింగ్, చిన్నారావు పాల్గొన్నారు.

● **అరసవల్లి:** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే అందించిన సేవలు అజరామరం అని బీసీ న్యాయవాదుల సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు అన్నారు. శ్రీకాకుళంలోని శాంతినగర్ కాలనీలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ● శ్రీకాకుళంలోని గాంధీ మందిరం స్మృతివనంలో నిర్వహించిన కార్యక్రమంలో సురంగి మోహనరావు, డి.విష్ణుమూర్తి తదితరులు నివాళులర్పించారు. కమిటీ ప్రతినిధులు జామి భీమశంకర్, నటుకుల మోహన్, కొంక్యాన మురళీధర్, బరాటం లక్ష్మణరావు, ఎం.ప్రసాదరావు, నక్క శంకరరావు, పొన్నాడ రవికుమార్, కె.పద్మావతి, ఎస్.రాజారావు పాల్గొన్నారు. ● అంబేడ్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ రోడ్డులో గల జ్యోతిరావు పూలే పార్కు వద్ద జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో కంఠ వేణు, వై.గురుమూర్తి, ఉదయ భాస్కర్,సుంకు రమణ, అప్పారావు, పురుషోత్తం, రాంబాబు పాల్గొన్నారు.

●**టెక్కలి:**టెక్కలిలో టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో వేర్వేరుగా జ్యోతిబాపూలే జయంతి నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షులు బగాది శేషగిరి జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వంజంగి వేణుగోపాల్ పాల్గొన్నారు.జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కణితి కిరణ్ కుమార్, గవరయ్య, కుమారస్వామి, శ్రీను, హరి పాల్గొన్నారు.



కలెక్టరేట్: జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీఆర్వో గణపతిరావు

●**సోంపేట:**పట్టణంలోని పూలే చిల్డ్రన్‌పార్కులో ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు, కొరికాన తరినీరావు, దూపాన బైరాగిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ● **కంచిలి:** కంచిలి తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బుడ్డేపు కామేష్ రెడ్డి, రిటైర్డు హెచ్‌ఎం సాహుకారి రామారావు, గిరి, నారాయణ పాల్గొన్నారు. ● **కొత్తూరు:** కొత్తూరు బీజేపీ కార్యాలయంలో పూలే జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు చోడవరపు నరసింహమూర్తి, నాయకులు వలరౌతు ప్రసాదరావు, బూరాడ భాస్కరరావు, వేలంపూడి వేణుగోపాలం, చిన్నారావు, శంకరరావు పాల్గొన్నారు.



అరసవల్లి:పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ న్యాయవాదులు



సోంపేట: పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు



కొత్తూరు: పూలే చిత్రపటం వద్ద..



టెక్కలి: టీడీపీ కార్యాలయంలో జ్యోతిబాపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు

వృద్ధులకు ఇంటి వద్దే ఓటు హక్కు

●పలాస నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ భరత్‌నాయక్

పలాస: 40 శాతం అంగవైకల్యం ఉన్న దివ్యాంగులు, 85 ఏళ్ల నిండిన వృద్ధులు ఓటుహక్కును ఇంటివద్ద వేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందని పలాస ఆర్డీవో, ఎన్నికల అధికారి భరత్‌నాయక్ తెలిపారు.గురువారం పలాసలో నియోజకవర్గ ఎన్నికల సిబ్బంది, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటుహక్కు వినియోగించుకోలేని దివ్యాంగులు, వృద్ధులకు ఇంటివద్దే ఓటుహక్కు కల్పించామని, ఎన్నికల సిబ్బంది నేరుగా వారివద్దకు వెళ్లి ఓటు వేయించుకుంటారని తెలిపారు. ఈనెల 15, 16, 17 తేదీల్లో ఎన్నికల అధికారులు గ్రామాల్లో పర్యటించి వృద్ధులు, దివ్యాంగులను గుర్తిస్తారని, వారి నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకుని ఓటుహక్కు కల్పిస్తారని చెప్పారు.సమావేశంలో తహసీల్దార్ ఎస్‌వీవీఎస్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భరత్‌నాయక్

దివ్యాంగులను గుర్తించాలి: ఆర్వో

నరసన్నపేట: దివ్యాంగులను, వయోవృద్ధులను గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆర్వో జీవీజీ రామ్మోహన్‌రావు తెలిపారు. గురువారం నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలకు రానివృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్ద ఓటు వేసే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్వో కనకరావు, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన

జలుమూరు (సారవకోట): సారవకోట మండలంలోని బద్రిలో గురువారం టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలపై ఆ పార్టీ మండలాధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు తర్ర బాలకృష్ణ, భాస్కరరావు, చల్ల ఆనందరావు, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

● **జలుమూరు:** మండలంలోని గొటివాడ, మూర్తిపేట, మహమ్మద్‌పురంల్లో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు, నరసన్నపేట ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి సతీమణి బగ్గు సుగుణమ్మ గురువారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, కన్వీనరు బగ్గు గోవిందరావు, నాయకులు మెయ్యి శ్రీనివాసరావు, గురుబెల్లి ఝాన్సీరాణి, దుంగ స్వామిబాబు, కింజరాపు సత్యం, గుండ రామకృష్ణ, ఉత్తరుడు, శిమ్మ తారకేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

●**వజ్రపుకొత్తూరు:** చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అవుతుందని పీఏసీఎస్ మాజీ చైర్మన్ దువ్వాడ హేమబాబుచౌదరి తెలిపారు. పూండి, గోవిందపురంలో టీడీపీ అభ్యర్థి గౌతు శిరీషకు మద్దతుగా ప్రచారం చేశారు. కార్యక్రమంలోటీడీపీనాయకులు పుచ్చ శోభారాణి,పుచ్చఈశ్వరరావు, కర్ని రమణ,గోవిందుపాపారావు, దున్న షణ్ముఖరావు, అట్టాడ రఘు పాల్గొన్నారు.

●**నందిగాం:** వేణుగోపాలపురం, కొండపేటల్లో టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పి.అజయ్‌కుమార్, పి.చంద్రశేఖర్, కె.ప్రసాదరావు, ఎం.బాలకృష్ణ, టి.మహేష్, ఎ.రాజేష్, టి.చిరంజీవి, గిరిబాబు, మదన్ పాల్గొన్నారు.

నేడు అచ్చెన్నాయుడు ప్రచారం

టెక్కలి: కోటబొమ్మాళి మండలంలోని తులసిపేట, భగీరథపురంలో శుక్రవారం ఉదయం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఎన్నికల ప్రచారం చేయనున్నారు. మధ్యాహ్నం టెక్కలి మండలంలోని చిన్ననారాయణపురం, మున్సబుపేట, ధర్మనీలాపురం, జయకృష్ణాపురంల్లో పర్యటించనున్నారు. అక్కవరంలో పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరనున్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పోలాకి:ఈదులవలస ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటలవరకూ పలుగ్రామాలకు విద్యుత్ సరఫ రాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ శంకరరావు, ఏఈ విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈదుల వలస, చిన్నఈదులవలస, దీర్ఘాశి, తోటాడ, రాళ్లపాడు కిల్లాం, ముప్పిడి, కింజరాపువానిపేట సంతలక్ష్మీపురం, కొండలక్కివలస, గొల్లలవలసకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.లోఓల్టేజ్ సమస్య పరిష్కరించేందుకు ఫీడర్‌లో మరమ్మతులుచేస్తున్నామని తెలిపారు.

14న అయ్యప్పస్వామి జయంతి

టెక్కలి: టెక్కలిలోని తెలుగుబ్రాహ్మణవీధిలోని ధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయంలో ఈనెల 14న అయ్యప్ప జయంతి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం ఆరు గంటల నుంచి అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్.ఎన్.పేట:లక్ష్మీనర్సుపేటజంక్షన్ వద్ద అలికాం-బత్తిలిరోడ్డుపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు..టెక్కలి సమీపంలోని అంజనాపురానికి చెందిన జి.రేవతీపతి హిరమండలంలోని శుభలైలోని తన పిన్ని ఇంటికి ఉగాదికి వచ్చాడు.తిరిగి గురువారం ద్విచక్రవాహనంపై విశాఖ బయలుదేరాడు. లక్ష్మీనర్సుపేట జంక్షన్‌వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో రేవతీపతి గాయపడ్డాడు. దీంతో స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో శ్రీకాకుళం తరలించారు.

ఓటర్లకు అవగాహన సదస్సు

కొత్తూరు: గొట్టిపల్లి పంచాయతీ పరిధిలోగల చిన్నరాజపురంలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓటర్లకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గొట్టిపల్లి పంచాయతీ బీఎల్వో కవితయ్య, వెలుగు అసోసియేషన్ ఏరియా కోఆర్డినేటర్ పాలక నాగేశ్వరరావు మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన యువత ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అధిష్ఠానం పునరాలోచించాలి: కలమట

మెళియాపుట్టి:పాతపట్నం ఎమ్మెల్యే సీటు విషయంపై టీడీపీ అధిష్ఠానం పునరాలోచించాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి కోరారు. గురువారం చాపర, కోసమాళ, జలగలింగుపురం, బందపల్లి పెద్దపద్మాపురం,సుందరాడ,ఎల్‌ఎల్‌పురంల్లో టీడీపీ కార్యకర్తలను కలిసి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ పరిణామాలు చంద్రబాబు నాయుడుకు వివరించినట్లు తెలిపారు. శనివారం పాతపట్నంలో జరిగే సంఘీభావ యాత్రకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కర్‌గౌడ్, వసంత్, బి.లలితకూమారి, సర్పంచ్‌లు అనురాధ, భాస్కరరావు, దినకరరావు, శ్రీధర్ పాల్గొన్నారు.

వలంటీర్లతో బలవంతపు రాజీనామా

టెక్కలి: టెక్కలి పంచాయతీ ఐదు సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న సుమారువందమంది వలంటీర్లతో గురువారం అధికారపార్టీ నాయకులు బలవంతపు రాజీనామాలు చేయించారు. వైసీపీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ తనకార్యాలయంలో వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేయించి రాజీనామా చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. మొత్తంగా అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు టెక్కలిలో వలంటీర్లు రాజీనామా చేశారు.

శాంతిభద్రతలు ఉల్లంఘిస్తే చర్యలు

టెక్కలి:ఎన్నికలసమయంలో గ్రామాల్లో శాంతి భద్రతలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సీఐ పి.పైడయ్య హెచ్చరించారు. గురువారం రాత్రి మండలంలోని లింగాలవలసలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవల్సిన బాధ్యత పౌరులపై ఉందన్నారు.సమావేశంలో మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు, ఉపసర్పంచ్ సంపతిరావు ఉమాపతి, రోణంకి శ్రీరామ్మూర్తి, పైడి శ్రీను, రోణంకి శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లివింగ్‌స్టోన్ చర్చిలో ఆశీర్వాద సభలు

టెక్కలి: టెక్కలి-తెంబూరు రోడ్డు జంక్షన్‌లో గల లివింగ్‌స్టోన్ చర్చిలో గురువారం పాస్టర్ కణితి అబ్రహం ఆధ్వర్యంలో ఆశీర్వాద సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ గాయకుడు తేజ, కణితి షైజాక్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సారా స్థావరాలపై ఎస్ఈబీ దాడులు

హరిపురం: మందస మండలంలోని కొండలోగాం పంచాయతీ పరిధిలోని రామరాయి, టబ్బాగాం పరిధిలో ఎస్ఈబీ అధికారులు గురువారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఆంధ్రజ్యోతిలో సారా మామూలే శీర్షికతో గురువారం ప్రచురితమైన కథనానికి స్పందించి మందస ఏజెన్సీలో ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు.జిల్లా ఎస్ఈబీ సూపరింటెండెంట్ తిరుపతిరావు,సోంపేట ఎస్ఈబీ సీఐ ఆర్.జైభీం ఆధ్వర్యంలో 34వేలలీటర్లు బెల్లం ఊటలు,20లీటర్లు సారాడంప్‌ను స్వాధీనం చేసుకుని ధ్వంసంచేశారు. పోలీసుల రాకను గమనించిన తయారీదారులు పరారయ్యారు.గ్రామాల్లో ఎవరెవరూ సారా బట్టీలను నిర్వహిస్తున్నారన్న విషయంపై దర్యాప్తు చేస్తున్నారు. గ్రామస్థులతో సమావేశం ఏర్పాటుచేసి సారా తయారీతో కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో పలాస డివిజన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రకుమార్, సీఐలు అప్పారావు, కూర్మారావు, మందస ఎస్ఐ అనీల్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కొండలోగాంలో స్వాధీనం చేసుకున్న బెల్లం ఊటలతో ఎస్ఈబీ సిబ్బంది

టీడీపీలో 400 మంది చేరిక

పలాస: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలో గల 29వ వార్డులో గురువారంరాత్రి వైసీపీకి చెందిన 400 మంది పలాస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష సమక్షంలో టీడీపీలో చేరారు. అనంతరం పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.ఈసందర్భంగా ఇంటింటా ప్రచారంచేసి సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, గాలి కృష్ణారావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, జోగమల్లి, గురిటి సూర్యనారాయణ, యవ్వారి మోహనరావు, వజ్జ భవాని, కౌన్సిలర్ జోగ త్రివేణి, కొత్త సత్యం, ఎ.రామకృష్ణ, టంకాల రవిశంకర్‌గుప్తా పాల్గొన్నారు.

●**పలాస రూరల్:** పెదంచల, చినంచలల్లో పలాస నియోజకవర్గ అభ్యర్థి గౌతు శిరీష ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారంచేశారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్‌రావు, పలాస నియోజకవర్గ సమన్వయకర్త దుర్గారావు, హరికృష్ణ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● **హరిపురం:**మందస మండలంలోని కొండలోగాం పంచాయతీ కొయ్యాదూరులో వార్డుసభ్యుడు సవర సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్.కృష్ణ, ఎస్.సురేష్, ఎస్.రమేష్, ఎస్.నీలకంఠం, ఎస్.చిన్నారావు, ఎస్.సోమేష్‌లతోపాటు పది కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి.వీరికి ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో దువ్వాడ లక్ష్మీభార్గవి, విఠల్‌రావు, మల్లా శ్రీను, టంకాల రవి, ఎస్.మురళి పాల్గొన్నారు.



పలాస: టీడీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న గౌతు శిరీష

వైసీపీకి ఓటు వేస్తే విధ్వంస పాలన: గోవిందరావు

మెళియాపుట్టి:రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటువేస్తే మళ్లీ విధ్వంసకర పాలన సాగుతుందని పాతపట్నం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మామిడి గోవిందరావు తెలిపారు. గురువారం బావనాపురం, సంతోషపురం, తంగిని, కరజాడల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ వైసీపీని సాగనంపాలని కోరారు. తొలుత పట్టుపురం మసీదుల్లో జరిగిన రంజన్ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సలాన మోహనరావు, నంబాళ్ల వెంకట్రావ్, ఎల్ఎంనాయుడు, భూపతినియుడు కె.హేమలత, రవికూమార్ పాల్గొన్నారు.



బావనాపురంలో ప్రచారం చేస్తున్న గోవిందరావు

అభివృద్ధిపై చర్చకు సవాల్

● శ్రీకాకుళం టీడీపీ ఎంపీ అభ్యర్థి రామ్మోహన్‌నాయుడు

సంతబొమ్మాళి: టెక్కలి నియోజకవర్గంలో 2014-19 మధ్య మాత్రమే అభివృద్ధి జరిగిందని, ఐదేళ్లుగా పూర్తిగా అభివృద్ధి కుంటుపడిందని శ్రీకాకుళం టీడీపీ ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆరోపించారు. అభివృద్ధిపై గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఎక్కడైనా చర్చకు బహిరంగ చర్చకు రావాలని సవాల్‌విసిరారు. గురువారం సంతబొమ్మాళిలో జరిగిన ఎన్నికల శంఖారావం సభలో మాట్లాడారు. సంతబొమ్మాళిలో దేవుడుపైనా రాజకీయం చేసి పాలేశ్వరస్వామి ఆలయంలోని నంది విగ్రహం వ్యవహారంలో టీడీపీ కార్యకర్తలపై కేసు పెట్టి హింసించారన్నారు.ఎన్డీఏ ప్రభుత్వంలో ప్రతిఎంపీ ఒక్కో పంచాయతీని దత్తత తీసుకోవాలని పేర్కొనగా, సంతబొమ్మాళిని దత్తత తీసుకున్నానని గుర్తుచేశారు. దీంతోపంచాయతీలో ఇంటింటికి కొళాయి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షకార్యదర్శులు జీరు భీమారావు,రెడ్డి అప్పన్న, జడ్పీటీసీ మాజీ సభ్యులు ఎల్ఎల్‌నాయుడు, బాడాన వెంకటరమణమ్మ, మాజీ సర్పంచ్‌లు కూశెట్టి కాంతారావు,మెండ అప్పారావు, టీడీపీ జిల్లా కార్యదర్శి బోయిన గోవిందరాజులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామ్మోహన్‌నాయుడు

వైసీపీకి చరమగీతం పలకాలి

●నరసన్నపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి

పోలాకి: వైసీపీకి చరమగీతం పలకాలని నరసన్నపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. గురువారం రహిమాన్‌పురం తదితర గ్రామాల్లో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి బగ్గు అర్చన బైరి భాస్కరరావు, కిల్లిలక్ష్మణరావు, కరుకోల రమేష్, ప్రగడ ఆనందరావు, పూజారి సోమేశ్వరరావు, మిరియబిల్లి వెంకట అప్పలనాయుడు పాల్గొన్నారు.

టీడీపీలో దేశవానిపేట వాసుల చేరిక

నరసన్నపేట: పట్టణంలోని దేశవానిపేట నుంచి పలువురు గురువారం టీడీపీలో చేరారు. పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు నక్క తవుడు, యాదవసంఘ ఉపాధ్యక్షుడు కొర్రాయి కృష్ణయాద్, గొవిలి శిమ్మయ్య, రాంబాబులను టీడీపీ నరసన్నపేట నియోజకవర్గ అభ్యర్థి బగ్గురమణమూర్తి కండువావేసి ఆహ్వానించారు. అనంతరం పురుషోత్తనగర్‌కాలనీ, రాజీవ్‌నగర్‌కాలనీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రజకులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బలగప్రవీణ్,టీడీపీ మండలాధ్యక్షుడు శిమ్మ చంద్ర శేఖర్, గొద్దు చిట్టిబాబు,కింజరాపు రామారావు, బెవరరాము, జామి వెంకట్రావు, కూన రమేష్, గుణుపురం లోకేశ్వ, పట్ట జనార్దనరావు, గొలివి రామారావు, బోయన సతీష్ పాల్గొన్నారు.



నక్క తవుడును టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బగ్గు రమణమూర్తి

ప్రయోగాత్మక ఆలోచనలతోనే ప్రయోజనం


వర్క్‌షాపులో పాల్గొన్న డైరెక్టర్ బాలాజీ

ఎచ్చెర్ల: ప్రయోగాత్మక ఆలోచనలతోనే ప్రయోజనమని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. ఇక్కడి క్యాంపస్‌లో ఈ నెల 12వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న టెక్‌ఫెస్ట్‌ను ముందుగా మెకానికల్, ఈఈఈ, ఈసీఈ బ్రాంచ్‌ల వర్క్‌షాపును ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. విద్యార్థులకు విజ్ఞానం, వినోదం రెండూ అవసరమేనన్నారు. ఈ ఫెస్ట్‌లో ఈ వెహికల్స్, డ్రోన్ సర్వేయింగ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఫోస్ ఫోర్ట్, టెక్ అరేనా, టెక్ ఫేట్, వెబ్ డిజైన్ కన్సల్‌హాక్, కాగానితో కోడ్, అన్వేషక, మైండ్ టెంటాకల్స్ స్పార్క్ యువర్ బ్రెయిన్, డిజైన్ డేర్బై తదితర ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ఎల్.సుధాకర్‌బాబు, ఏవో ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ రవి, ఫెస్ట్ కన్వీనర్ వాసు, కో కన్వీనర్ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాల విజృంభణ

నందిగాం: ప్రతాప విశ్వనాథపురంలో విష జ్వరాలు విజృంభించాయి. 25 మంది జ్వరాలతో నాలుగు రోజులుగా బాధపడుతున్నారు. పలాస, హూండి తదితర చోట్ల ప్రైవేట్ ఆసుపత్రుల్లో పలువురు చికిత్సలు పొందుతున్నారు. నందిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.అనితకుమారి ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం బాధితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. మరోవైపు పంచాయతీ కార్యదర్శి ధనుంజయరావు పర్యవేక్షణలో పారిశుధ్య కార్యక్రమాలు, క్లోరినేషన్ చేపట్టారు. గ్రామానికి చెందిన బమ్మిడి మోహనరావు, కంచరాన కృష్ణవేణి, పానిల మహాలక్ష్మి, లచ్చయ్య, పారమ్మ, బమ్మిడి జగన్నాథం, కిక్కర వర్షిత తదితరులు జ్వరాల బారిన పడ్డారు.

తపాలా పథకాలతో ప్రయోజనం

సోంపేట/కంచిలి: తపాలా పొదుపు పథకాలు అన్నివర్గాలకు బాసటగా నిలుస్తాయని జిల్లా ఆ శాఖ కార్యనిర్వహణాధికారి హరికృష్ణ తెలిపారు. సోంపేట సబ్‌డివిజన్ పరిధిలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యధిక ఖాతాలు (403) తెరిచిన కంచిలి మండలం శ్రీరాంపురం పోస్టు మాస్టర్ మాదిన రాజేశ్వరరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జయసింహ, సంతోష్, వేమన, రామారావు తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలు తిప్పికొట్టాలి

కొత్తూరు: ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించి కూలీల కడుపుకొడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని మెట్టూరు బిట్-3లో ఉపాధి కూలీల పని ప్రదేశంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో మంగన్న, దశమి, శ్రీరాములు, శేషగిరిరావు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులపై పోరాటం చేయాలి


వజ్రపుకొత్తూరు: స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పలాస రూరల్: ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దోపిడీ పాలకుల పాశ వికపాలనను సాగిస్తూ కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను అమ్మేస్తున్నారని, వారిపై పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు గొరకల బాలకృష్ణ పిలుపు నిచ్చారు. గురువారం పలాస మండలంలోని బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో పైల వాసుదేవరావు వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐఎఫ్‌టీయూ నాయకులు పి.మల్లేశ్వరరావు, పీవోడబ్ల్యూ సంఘ నాయకులు హేమక్క, పుణ్యవతి, గీత, మాధవరావు, మల్లేశ్వరరావు, భాస్కరరావు, అప్పయ్య పాల్గొన్నారు.

● **వజ్రపుకొత్తూరు:** శ్రీకాకుళం సాయుధ పోరాటంలో తొలితరం నాయకుడు పైల వాసుదేవరావు అని సీపీఐ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. రిట్టపాడు అమరవీరుల స్మారక స్థూపం వద్ద వాసుదేవరావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పైల చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మామిడి భీమారావు, వినోద్, బతకల ఈశ్వరమ్మ, జల్లు వీరాస్వామి, సోమేశ్వరరావు, చంద్రయ్య, పైల అప్పారావు పాల్గొన్నారు.

పెంటూరులో ఆలయ వార్షికోత్సవం


కుంకుమ పూజలు చేస్తున్న దృశ్యం

నందిగాం: పెంటూరులో నీలమణిదుర్గ, చింతపోలమ్మ అమ్మవార్ల ఆలయ ఆరో వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. గ్రామస్థుల ఆధ్వర్యంలో పురోహితులు రేజేటి బోసుబాబు, సహాయకులు ఎం.రమేష్‌శర్మ పర్యవేక్షణలో విశేషపూజలు, మహిళలతో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

మెళియాపుట్టి: వచ్చే ఎన్నికల్లో ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పాతపట్నం సీఐ నల్లి సాయి తెలిపారు. గురువారం చీపురుపల్లిలో ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఎస్ఐ టి.రాజేష్ పాల్గొన్నారు.

పాతపట్నంలో యువకుల ఇంటింటి సర్వే


సర్వే చేస్తున్న యువకులను ప్రశ్నిస్తున్న టీడీపీ నాయకులు

పాతపట్నం: పాతపట్నంలో టీడీపీ మద్దతుదారులకు సంబంధించిన ఓటర్లు అధికంగా ఉన్న ప్రాంతాల్లో జాబితా వెరిఫికేషన్ పేరిట ఇంటింటా సర్వేకు వచ్చిన యువకులను టీడీపీ మండలాధ్యక్షుడు పైల బాబ్జీ, ఆ పార్టీ నాయకులు గురువారం సాయంత్రం అడ్డుకున్నారు. పాతపట్నంలోని కాపువీధి, దువ్వార వీధిలో టీడీపీ సానుభూతిపరులు ఓటర్లు ఉండే ఇళ్లకు వెళ్లి జాబితాల్లో వివరాలను సేకరిస్తుండడంతో ప్రశ్నించారు. ఓటర్ల వివరాలను సేకరిస్తున్న యువకులను నిలదీశారు. వారిని ప్రశ్నించగా తాము హైదరాబాద్‌కు చెందిన వీ-పాట్ సంస్థకు చెందిన వారమని, తమ సంస్థ ఆదేశాల మేరకు ఓటరు జాబితాలో మృతుల ఓట్ల తొలగింపు సక్రమంగా జరిగాయా లేదా అంటూ తదితర అంశాలపై సర్వే నిర్వహిస్తున్నట్టు యువకులు తెలిపారు. 20 మందిగా వచ్చిన వీరంతా అచ్యుతాపురంలో అద్దెకు ఇల్లు తీసుకుని ఉంటున్నారు. కాగా వీరు ఉండే రూములో ల్యాప్‌ట్యాప్‌లు తదితర ఆధునిక పరకరాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. టీడీపీ నాయకులు అడ్డుకోవడంతో వెనుతిరిగి పోయారు. కాగా వీరిపై నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.అప్పారావుకు పైల బాబ్జీ ఫిర్యాదు చేశారు. దీంతో వీఆర్వో పార్థసారథిని పంపించి విచారణ నిర్వహించగా.. వారి వద్ద ల్యాప్‌టాప్ తదితర సామగ్రి ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఇద్దరికి ఎం.నాగదిలీప్, వినయ్ పేర్లతో ఐడెంటిటీ కార్డులు ఉన్నాయి. అయితే వీరు సర్వే నిరహణకు తీసుకొచ్చిన ఓటర్ల జాబితాలపై వైసీపీ నాయకుని పేరు ఉండడంతో కేవలం టీడీపీ సానుభూతిపరుల ఓట్ల తొలగింపునకు వచ్చిన ముఠాగా టీడీపీ నాయకులు అనుమానిస్తున్నారు.

నిధులున్నా.. పనులు సున్నా!

● నేటికీ బ్రిటిష్ కాలం నాటి కల్వర్టే
● బిక్కుబిక్కుమంటూ రాకపోకలు
● పట్టించుకోని అధికారులు


శిథిలావస్థకు చేరుకున్న బ్రిటిష్ కాలం నాటి కల్వర్టు

గార: మండల కేంద్రమైన గారలో వంశధార కాలువపై ఉన్న బ్రిటిష్ కాలం నాటి కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. ఈ విషయమై గతంలో 'ఆంధ్రజ్యోతి'లో పలు దఫాలుగా కథనాల రావడంతో సంబంధిత అధికారులు స్పందించి.. కొత్తగా కల్వర్టు నిర్మాణానికి అంచనాలు రూపొందించి ఉన్నత అధికారుల ఆమోదం కోసం పంపారు. ఈ నేపథ్యంలో కొత్త కల్వర్టు నిర్మాణానికి రూ.40 లక్షలు నిధులు మంజూరు చేశారు. టెండర్లు ప్రక్రియ కూడా పూర్త యింది. బిల్లులు సకాలంలో రావనే ఉద్దేశంతో సం బంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించేందుకు ఆసక్తి చూపడంలేదని తెలుస్తుంది. కళింగపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్లే ఈ ఆర్అండ్‌బీ రోడ్డుపై అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దశాబ్దాల కిందట నిర్మించిన ఈ కల్వర్టు ఏ క్షణాన కూలిపోతుందోనని ఈ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. 12 మీటర్లు వెడల్పుతో నిర్మించనున్న ఈ కల్వర్టు నిర్మాణం పూర్తి చేస్తే వాహనాల రాకపోక లకు ఇబ్బంది ఉండదని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


నరసన్నపేట: జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ఆమదాలవలస: మత పెద్దలను సత్కరిస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్


ఇచ్ఛాపురం: ఆలింగనం చేసుకుంటున్న ముస్లిం చిన్నారులు

ఇచ్ఛాపురం: జిల్లా వ్యాప్తంగా గురువారం రంజాన్ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి మసీదుల్లో నమాజు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇచ్ఛాపురంలోని జామియా మసీద్, కస్పావీధిలోని మసీదులో ప్రత్యేక ప్రార్థలు చేశారు. మత పెద్దలు జామ మసీద్ మూతవాలి ఎండీ అహమ్మద్ అలీ, మత గురువు అనీసులు ఖాద్రీ, ఎండీ ఫరీద్, జోహార్ ఖాన్, రఫీ, జిలానీ, అహ్మద్ అబ్దుల్లా, అలీంఖాన్, యూసఫ్ తదితర పెద్దలు పాల్గొన్నారు.

● **ఆమదాలవలస:** రంజాన్ సందర్భంగా గురువారం ముస్లింలు పండగ ప్రత్యేక ప్రార్థనలు గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నూరాని మసీదులో మత గురువు అలీ అహ్మద్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రార్థనలు చేపట్టారు. పట్టణ ముస్లిం సంఘ అధ్యక్షులు షేక్ జిలానీ, మత పెద్ద అబ్దుల్ ఆలీ, అహ్మద్, ముస్లిం భక్తులు షేక్‌బుకారి, అబ్బు ముగ్బల్ పాల్గొన్నారు.

● **నరసన్నపేట:** స్థానిక జామియా మసీదులో ముస్లిములు రంజాన్ పురస్కరించుకుని గురువారం ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో జామియా మసీదు పెద్దలు షేక్ బాబ్జీ, మదీనా, ఎండీ ఆరీఫ్, షెక్ షబీర్, మహ్మద్ అజీద్, షేక్ అబ్దుల్లా పాల్గొన్నారు.

● **కాశీబుగ్గ:** కాశీబుగ్గ జామియా మసీదులో ముస్లిములు రంజాన్ పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ జామియా మసీదు అధ్యక్షుడు షేక్ ఖాదర్ భాషా మాట్లాడుతూ రంజాన్ సామరస్యానికి, సుహృద్భావానికి, సర్వమానవ సమానత్వానికి, కరుణ కు, దాతృత్వానికి ప్రతీక అని తెలిపారు. కార్యక్రమంలో భషీర్, హీమామ్, ముక్తార్ ఆలామ్, రాజేష్, జిలాని, గౌస్, గఫూర్, సలీమ్‌ఖాన్ పాల్గొన్నారు.

● **పాతపట్నం:** ప్రహరాజపాలెం గ్రామంలో ముస్లింలు రంజాన్ గురువారం ఘనంగా జరుపుకున్నారు. మతగురువు అఫీజ్ షాజహాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. రిటైర్డు ఉపాధ్యాయుడు పి.రామరాజు, షేక్‌చాంద్, షేక్ ఇబ్రహీం, సలీం, సయ్యద్ మదార్, జమాల్ తదితరులు పాల్గొన్నారు.


కాశీబుగ్గ: మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


పాతపట్నం: ప్రహరాజపాలెంలో..

వాహనాలను పక్కాగా తనిఖీ చేయాలి


మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి

జి.సిగడాం: అనుమానం కలిగిన వాహనాలను పక్కాగా తనిఖీలు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మణమూర్తి అన్నారు. గురువారం ఉల్లివలస వద్ద గల చెక్‌పోస్టును ఆయన పరిశీలించారు. అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని, డబ్బును తరలించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గెడ్డకండరాం, జి.సిగడాం, మెట్టవలస తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు.

సందడిగా నవరాత్రి ఉత్సవాలు


కచేరిలో పాల్గొన్న కళాకారులు

ఇచ్ఛాపురం: టి.బరంపురంలోని సీతారామ ఆలయంలో వసంత శ్రీరామ నవమి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రసాద వితరణ చేపట్టారు. చండీపుట్టుగ గ్రామానికి చెందిన సంగీత కళాకారులు గొనప లక్ష్మణమూర్తి బృందం సంగీత కచేరి నిర్వహించారు. సంగీత కళాకారులు తిప్పన ధనుంజయరెడ్డి, వెంకటేశం, హరిశంకర్, నీలంతేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం


పుష్పాలంకరణలో స్వామివారు

గార: బూరవెల్లిలో షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం బాబా వారికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. సాయంత్రం బాబావారి పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. బోరవానిపేట, బూరవెల్లి సత్యసాయి భజన మండలి భక్తులు పాల్గొని నగర సంకీర్తన చేపట్టారు. కార్యక్రమం ఆలయ అర్చకులు ఆరవెల్లి అనంతరామన్, ఇతర అర్చక స్వాములు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం


ఈవోకు విరాళాన్ని అందిస్తున్న భక్తుడు

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని శ్రీకాకుళం నగరానికి చెందిన కేకే విశ్వేశ్వరరావు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి శాశ్వత అన్నదాన పథకానికి లక్ష రూపాయల చెక్కును ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్‌కు అందజేశారు. ఆలయ అర్చకులు వారిని వేదమంత్రాలతో ఆశీర్వదించగా, ఈవో స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

తాగునీరు వృథా


ధర్మపురం వద్ద లీకవుతున్న పైపులైన్

ఇచ్ఛాపురం: జల్‌జీవన్ మిషన్ పైపులైన్లు లీకులు రావడంతో తాగునీరు వృథాగా పోతుంది. ధర్మపురం గ్రామం వద్ద గల పైపులైన్ లీకులు కావడంతో నీరంతా చెరువు పాలవుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. వేసవిలో అంతంత మాత్రమే తాగునీరు వస్తుంది. దీనికి తోడు నీరు వృథాగా పోవడంతో తాగునీటికి మరింత ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి పైపులైన్ లీకులు బాగుచేయాలని కోరుతున్నారు. కొత్తగా జల్‌జీవన్ మిషన్ ద్వారా పైపులైన్లు వేసినా అధికారులు నిర్లక్ష్యం కారణంగానే పైపులైన్లు లీకులు వస్తున్నాయని గ్రామ ప్రజలు తెలిపారు.

దుర్మార్గ పాలనకు చరమగీతం పాడాలి

● ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు


ఎంపీతో సెల్ఫీలు తీసుకుంటున్న యువత

అరసవల్లి: వైసీపీ పాలనలో అన్ని రంగాల్లో సర్వనాశనమైన రాష్ట్రాన్ని బతికించుకోవాలంటే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని గెలిపించుకోవాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. గురువారం ఉదయం నగరంలోని స్థానిక పొట్టి శ్రీరాములు మార్కెట్, దమ్మలవీధి తదితర ప్రాంతాల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌తో కలిసి ప్రజాగళం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో చేపట్టిన పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయని ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్, స్టేడియం పనులు ముందుకు సాగలేదన్నారు. రూ.33 కోట్లు కేటాయించి శంకుస్థాపన చేసిన ఆమదాలవలస రోడ్డు పనులు ఏడాదిలో పూర్తి కావాల్సిందని, కానీ ఐదేళ్లయినా పూర్తి చేయకుండా ఎంతోమంది ప్రాణాలను బలితీసుకున్నారని దుమ్మెత్తిపోశారు. టిడ్కో ఇళ్లతో వ్యాపారం చేశారని, అసలైన లబ్ధిదారులకు, వారు కట్టిన డబ్బులు ఇవ్వకుండా అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా యువత పెద్ద ఎత్తున ఎంపీతో సెల్ఫీలు తీసుకోవడానికి పోటీ పడ్డారు. రంజాన్ సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కూటమి నాయకులు శవ్వాన ఉమామహేశ్వరి, బి.ఉమామహేశ్వరరావు, పీఎంజే బాబు, కోరాడ హరగోపాల్, కొమ్మనాపల్లి వెంకటరామరాజు, విభూది సూరిబాబు, మెండ దాసునాయుడు, పాండ్రంకి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి 150 వైసీపీ కుటుంబాలు


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రవికుమార్

పొందూరు: ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార వైసీపీకి భారీ షాక్ తగిలింది. తోలాపి గ్రామంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ సమక్షంలో బుధవారం 150 కుటుంబాలు పార్టీ కండువా కప్పుకున్నాయి. మాజీ ఎంపీటీసీ పప్పల అప్పలనాయుడు, పొన్నాడ అప్పన్న, పొన్నాడ గంగాధర్, పొన్నాడ సత్యం, ఉపసర్పంచ్ పప్పల శ్రీను. మొదలవలస వల్లయ్య పొన్నాడ నాగజ్యోతి ఆధ్వర్యంలో 150 కుటుంబాల్లోని సుమారు 400 మంది టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి టీడీపీ చేపట్టనున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొన్నాడ రామారావు, జనసేన పార్టీ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, నాయకులు ఎ.రాము, వందాన మురళి, బి.శంకరభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పండి: ఎన్ఈఆర్


రణస్థలం: పాతర్లపల్లిలో ర్యాలీ చేపడుతున్న దృశ్యం

రణస్థలం: మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ఎచ్చెర్ల నియోజకవర్గం ఎన్డీఏ కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. ఆత్మీయ కలయ పర్యటనలో భాగంగా గురువారం పాతర్లపల్లి, కొవ్వాడ, కోటపాలెం, అల్లివలస, జీరుపాలెం, కొచ్చెర్ల, రణస్థలం గ్రామాల్లో పర్యటించారు. పాతర్లపల్లి గ్రామంలో అభిమానులు బ్రహ్మరథం పట్టారు. స్థానిక పరిశ్రమల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. మత్స్యకారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీజీఎం ఆనందరావు, చౌదరి బాబ్జీ, ముప్పిడి సరేష్, గొర్లె లక్ష్మణరావు, పిషిని జగన్నాథంనాయుడు, పైడి అప్పడదొర, కనకారావు, మైలపల్లి పోలీస్, గొర్లె సాయిబాబు, దుమ్ము అశోక్, విశ్వక్సేన్, బసవ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డికి ఓటుతో బుద్ధి చెప్పాలి: అశోక్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం: ఒక్క చాన్స్ అంటూ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన జగన్‌రెడ్డికి ఓటుతో బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి సంతపేట వద్ద గల ఆటో యూనియన్ సామాజిక భవనంలో స్వేచ్ఛావతి ఆటో యూనియన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లే చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందన్నారు. వాహనమిత్ర పేరుతో రూ.10వేలు ఇచ్చి వివిధ ట్యాక్సుల రూపంలో ఏడాదికి రూ.50 వేలు వరకు ప్రభుత్వం దోచుకుందన్నారు. ఆటో యూనియన్ నాయకులు ఎర్రయ్యరెడ్డి, కూటమి నాయకులు దాసరి రాజు కొండా శంకర్‌రెడ్డి, నందికి జాని, రెయ్యి జానికిరావు, కాళ్ల దిలీప్, బి.కృష్ణయ్య, నాగరాజుపాత్రో, కర్రి నాగరాజు, లీలారాణి తదితరులు పాల్గొన్నారు. ధర్మపురం గ్రామంలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఇంటింటా ప్రచారం చేపట్టారు. ● టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు పేదలపాటి వరమన్నారు. ఈ సందర్భంగా గ్రామ యువత, క్రీడాకారులు సమస్యలు వివరించారు. టీడీపీ నాయకులు నందికి జాని, లీలారాణి, కొండా శంకర్‌రెడ్డి, రెయ్యి జానికిరావు, దక్కత ఢిల్లీరావు, సహదేవ్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ బుద్దాల నిర్మలారెడ్డి, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పన దుర్యోధనరెడ్డి, పద్మనాభం, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇవే చివరి ఎన్నికలంటూ ధర్మాన మరో మోసం

అరసవల్లి: తనకు ఇవే చివరి ఎన్నికలంటూ మంత్రి ధర్మాన మరోమారు ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని కూటమి శ్రీకాకుళం నియోజకవర్గ అభ్యర్థి గొండు శంకర్ విమర్శించారు. గురువారం నగరంలోని 12వ డివిజన్‌లో తాళ్లూరి నవీన్, గోవర్ధనరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. గార మండలం శ్రీకూర్మంలో ప్రచారం చేట్టగా, 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తూలుగు పంచాయతీలో..

గార: శ్రీకాకుళం నియోజకవర్గం కూటమి అభ్యర్థి, తన భర్త గొండు శంకర్ తరఫున సతీమణి స్వాతి గురువారం తూలుగు పంచాయతీలో ప్రచారం నిర్వహించారు. అత్యధిక మెజార్టీతో తన భర్త శంకర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

బురిడివలసలో ప్రచారం

సరుబుజ్జిలి: షలంత్రి గ్రామ పంచాయతీ బురిడివలసలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ ఆధ్వర్యంలో టీడీపీ శంఖారావం సూపర్‌సిక్స్ కార్య క్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ ప్రవేశపెట్టనున్న పథకాలపై వివరించారు. టీడీపీ నాయకులు కిల్లి సిద్దార్థ, కొర్ను సూర్యనారాయణ, గణపతిరావు, మీసాల రామారావు, కందుల వెంకటరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి


ఆమదాలవలస: మాట్లాడుతున్న సీఐ దివాకర్‌యాదవ్

ఆమదాలవలస: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత ఎన్నికలు నిర్వహించడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని సీఐ దివాకర్ యాదవ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని రావికంటిపేట పోలీసు స్టేషన్ పరిధిలో గ్రామస్థులతో అవగాహనా సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా యువత రాజకీయ పార్టీలకు వత్తాసు పలికి వివాదాలు కొని తెచ్చుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మండల వీధిలో..


శ్రీకాకుళం క్రైం: మాట్లాడుతున్న ఎస్ఐ గణేష్

శ్రీకాకుళం క్రైం: ప్రశాంత వాతావరణం సార్వత్రిక ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని వన్‌టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్ కోరారు. గురువారం నగరంలో మండల వీధిలో ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వివాదాలకు దూరంగా ఉండాలని, చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మెట్టక్కివలసలో ప్రచారం

ఆమదాలవలస: పట్టణ పరిధి మెట్టక్కివలసలో స్పీకర్ తమ్మినేని సీతారాం గురువారం ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. వైసీపీ నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, అజంతాకుమారి, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.